క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత


నగదు అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడి కుటుంబానికి షాద్‌నగర్ ఉద్యమకారుల సంక్షేమ సంఘం నాయకులు అండగా నిలిచారు. శనివారం పట్టణానికి చెందిన ఉద్యమకారుడు సందనవెల్లి మల్లేశ్ భార్య సువర్ణ ఆరోగ్యం క్షీణించిన విషయాన్ని తెలుసుకున్న సంక్షేమ సంఘం నాయకులు రూ.31 వేల నగదు అందించారు. కార్యక్రమంలో సంఘం చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, నాయకులు యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్, రవీందర్, సుధాకర్, రవికుమార్‌గౌడ్, అశోక్‌రెడ్డి, శేఖర్, మల్లేశ్, ఉమ ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా ప్లేస్‌మెంట్ డే


విద్యార్థికి నియామకపత్రం అందజేస్తున్న డాక్టర్ వికాస్‌సింగ్ తదితరులు

మొయినాబాద్‌రూరల్: ఉద్యోగ అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకున్నప్పుడే వారి తల్లిదండ్రులకు సంతోషం కలిగిస్తాయని విద్యావేత్త, ప్రపంచ ఆర్థికవేత్త డాక్టర్ వికాస్‌సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి మున్సిపల్ పరిధిలోని ఎన్కెపల్లి రెవెన్యూ పరిధిలో జేబీఐఈటీ ఇంజనీరింగ్ విద్యా సంస్థలో ప్లేస్‌మెంట్ డే 2025ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆ విద్యా సంస్థల కార్యదర్శి జే.వి.కృష్ణారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంబరాల్లో ముఖ్యఅతిథిగా డాక్టర్ వికాస్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో వర్షం


కొనాయపల్లి రోడ్డుపై విరిగిన చెట్టు

కేశంపేట: మండల పరిధిలోని సంతాపూర్, కొనాయపల్లి, కొత్తపేట గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వాన కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. పలుచోట్ల రహదారి పక్కన ఉన్న చెట్లు పడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈదురుగాలుల వానకు పంటలకు తీవ్ర నష్టం కలిగించినట్లు రైతులు వాపోయారు.

రోడ్డుపై కుప్పల తిప్పలు



నందిగామ: మండల కేంద్రమైన నందిగామ నుంచి బైపాస్ రహదారికి వెళ్లే రోడ్డులో కంకర కుప్పలు వేసి సుమారు 15 రోజులైనా వాటిని సరిచేసే నాథుడే కరువయ్యారు. దీంతో ఆ మార్గంలో వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో నందిగామ నుంచి బైపాస్ వరకు బీటీ రోడ్డు మంజూరు కాగా కొంత వరకు సీసీ రోడ్డు వేశారు. మిగతా రోడ్డును బీటీ వేసేందుకు కాంట్రాక్టరు కంకర పోసి వదిలేయడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, కాంట్రాక్టరు స్పందించి కంకర కుప్పలను సరిచేయాలని వాహనదారులు కోరుతున్నారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్త ముఖ్యం

యాచారం: వానాకాలం సీజన్‌లో విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తగా ఉండాలని మండల వ్యవసాయాధికారి రవినాథ్ సూచించారు. మండల పరిధిలోని మాల్, యాచారం కేంద్రాల్లో లైసెన్స్‌డ్ విత్తనాల విక్రయ దుకాణాల్లో శనివారం ఆయన తనిఖీలు చేశారు. ఏయే రకాల విత్తనాలు ఉన్నాయి. ఎంత ధరకు విక్రయిస్తున్నారు..? స్టాక్ బోర్డులు ఏర్పాటు చేశారా..? రశీదులు ఇస్తున్నారా..? తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. లైసెన్స్‌డ్ డీలర్ల వద్దే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని యజమానులను హెచ్చరించారు.

పత్రాల కోసం ప్రయాస

▲ మొయినాబాద్‌కు చెందిన కమ్మరి కృష్ణ గత ఏప్రిల్ 9న మరణించారు. ధ్రువీకరణ పత్రం కోసం అదే నెల 21న ఆయన కొడుకు శివ మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేశారు. 45 రోజులు దాటినా ఇంతవరకు సర్టిఫికెట్ రాలేదు. ధ్రువీకరణ పత్రం వస్తే మృతుడి భార్య పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. ఎన్నిసార్లు తిరిగినా సైట్ ఓపెన్ కాలేదనే సమాధానం చెబుతున్నారు.

➡ శంషాబాద్ మండలం మల్కారం గ్రామానికి చెందిన అనూష మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని భాస్కర జనరల్ ఆస్పత్రిలో గత జనవరి 18న ప్రసవం అయింది. ఆమెకు ఆడబిడ్డ జన్మించింది. వైద్యశాలలో ఇచ్చిన పత్రంతో బర్త్ సర్టిఫికెట్ కోసం మొయినాబాద్ మున్సి పల్ కార్యాలయానికి ఫిబ్రవరి నుంచి తిరుగుతున్నారు. ఇంతవరకు బర్త్ సర్టిఫికెట్ రాలేదు.

- బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీకి ఎదురుచూపులు
- మొయినాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఐదు నెలలుగా ఇబ్బంది



మొయినాబాద్ మున్సిపాలిటీ కార్యాలయం

మొయినాబాద్: జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం మొయినాబాద్ మున్సిపాలటీ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పురపాలక సంఘం ఏర్పడి ఐదు నెలలు దాటినా ఇప్పటి వరకు జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు ఒక్కటి కూడా జారీ కాలేదు. ప్రతి రోజు ఎంతో మంది పత్రాలకోసం మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు మాత్రం స్పందించడం లేదు. సైట్ ఓపెన్ కావడంలేదు.. పది రోజుల తరువాత రండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. దీంతో ధ్రువీకరణ పత్రాలు లేక పనులు సాగకం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

అప్పుడు సులువు.. ఇప్పుడు కష్టం

మున్సిపాలిటీ ఏర్పాటుకాకముందు మొయినాబాద్ తోపాటు పెద్దమంగళారం, చిలుకూరు, హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్, ఎనికేపల్లి, ముర్తూజగూడ, సురంగల్ గ్రామ పంచాయతీలుగా ఉండేవి. అప్పట్లో గ్రామ పంచాయతీల్లోనే పంచాయతీ కార్యదర్శిలు జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేవారు. దీంతో ప్రజలు ఇబ్బంది పడాల్సిన అవసరం లేకుండా సాఫీగా సర్టిఫికెట్లు పొందేవారు. కానీ మున్సిపాలిటీ ఏర్పాటయ్యాక అన్ని గ్రామాల ప్రజలు అజీజ్‌నగర్‌లో ఉన్న మున్సిపల్ కార్యాలయానికే వెళ్లాల్సి వస్తుంది. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసినా ఇప్పటివరకు ఒక్కటీ జారీ కాలేదు. దీంతో దరఖాస్తు చేసుకున్నవారంతా కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

పెండింగ్‌లో పది వేల సర్టిఫికెట్లు

మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో భాస్కర జనరల్ ఆస్పత్రి ఉండటంతో ప్రతి రోజు ఇక్కడ డెలివరీలు జరుగుతుంటాయి. రోజుకు సుమారు 10 డెలివరీలు అవుతుంటాయి. ఇలా చూస్తే నెలకు సుమారు 3వేల మంది పిల్లల బర్త్ సర్టిఫికెట్లు జారీ చేయాల్సి ఉంటుంది. మున్సిపల్ కార్యాలయంలో ప్రస్తుతం సుమారు 10 వేలకు పైగా బర్త్ సర్టిఫికెట్లు ఇవ్వాల్సి ఉంది. ఆన్‌లైన్ ద్వారా సర్టిఫికెట్లు ఇవ్వడానికి సైట్ ఎప్పుడు ఓపెన్ అవుతుందో అధికారులకే తెలియాలి. సర్టిఫికెట్ల కోసం మాత్రం ప్రజలు ఎదురుచూస్తూనే ఉన్నారు. అదే విధంగా డెత్ సర్టిఫికెట్ల కోసం కూడా చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు.

త్వరలో జారీ చేస్తాం

జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించి ఇంత కాలం సైట్ ఓపెన్ కాలేదు. ప్రస్తుతం సైట్ ఓపెన్ అయ్యింది. సోమవారం నుంచి సర్టిఫికెట్లు జారీ చేస్తాం. వారం పది రోజుల్లో పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను క్లియర్ చేస్తాం.

– సుదర్శన్, సెక్షన్ ఇన్‌చార్జి, మొయినాబాద్

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

కేశంపేట: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో జెడ్పీ, ఎఫ్‌డీఎఫ్ నిధులు రూ.15 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. అంగన్‌వాడీ భవనంలో ఎలాంటి మౌలిక అవసరాలు ఉన్నా వెంటనే వాటిని ఏర్పాటు చేస్తానన్నారు. అనంతరం జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. క్రీడల్లో జాతీయ స్థాయిలో పాల్గొని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, నాయకులు వీరేష్, జగదీశ్వర్, శివయ్య, సుందరయ్య, నారాయణ, రాణి, భాస్కర్, కరుణాకర్, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తొలగించండి

ఇళ్లపై నుంచి విద్యుత్ వైర్లను తొలగించాలని ఎమ్మెల్యే శంకర్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. అధికారులు, నాయకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని ఆరోపించారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా పనిచేద్దాం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి


మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: వికసిత్ భారత్ లక్ష్యంగా పనిచేద్దామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్ రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో బీజేపీ పట్టణ అధ్యక్షుడు హరిభూషణ్‌పటేల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలనలో నిరుపేదల అభ్యున్నతి కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ సబ్‌కా విశ్వాస్ లక్ష్యంతో పనిచేస్తూ అనేక ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలకు మార్గం చూపుతున్నారన్నారు. కశ్మీర్ సంపూర్ణంగా భారత్‌లో విలీనం, ఆర్టికల్ 370 రద్దు చేయాలని ఉద్యమాన్ని ప్రారంభించిన జనసంఘ్ అధ్యక్షుడు శ్యామ్‌ప్రకాశ్ ముఖర్జీ బలిదాన్ దివస్(జూన్23)న ప్రతి పోలింగ్ బూత్‌లో నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి అశోక్, నాయకులు మురళి, వెంకటేష్, రాము, సత్యనారాయణ, నర్సింలు, శ్రీహరిగౌడ్, శ్యాంసుందర్, విఠల్, రామకృష్ణగౌడ్, మల్లేశ్, విజయ్, ప్రవీణ్, పరందాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి ఊరేగింపు


ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

శంకర్‌పల్లి: పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో రెండు నుంచి వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం హనుమాన్ దేవాలయం నుంచి అయ్యప్పస్వామి ఆలయం వరకు ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణం నుంచే కాకుండా చుట్టుపక్కల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తీర్థప్రసాదాలు స్వీకంచారు. ఊరేగింపులో ఆలయ కమిటీ సభ్యులు మోహన్, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, పాండురంగారెడ్డి, జంగయ్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ రాష్ట్రాన్ని దోచుకుంది

కాంగ్రెస్ నేతల మండిపాటు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రాజెక్టుల పేరుతో లూటీ చేశారని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యా నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ ఆరోపించారు. శనివారం కడ్తాల్‌లో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర సంపదను కొల్లగొట్టిన అవినీతి పరులను, ప్రభుత్వం ఉపేక్షించబోదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి అక్రమలపై కమిషన్ నోటీసులు ఇస్తేనే బీఆర్‌ఎస్ నాయకులు తట్టుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. నోటీసులు అందుకున్న వారు కమిషన్ ముందు హాజరైతే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 17 నెలల కాలంలోనే, అనేక అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తోందని తెలిపారు. ఇది తట్టుకోలేక బీఆర్‌ఎస్ నేతలు విష ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు.

వైభవంగా అమ్మవారి వేడుకలు

మంచాల: మండలంలోని బోడకొండలో జగదాంబమేరామ్మదేవి ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తనయుడు అభిషేక్‌రెడ్డి శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధ్వజస్తంభ ఏర్పాటులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల ఆరాధ్య దైవం మేరామ్మదేవి అన్నారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో కృషిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచాల పీఏసీఎస్ చైర్మన్ వెదెరె హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు గుండమోని జయమ్మ, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొర్ర పాండు నాయక్, మండల నాయకులు రమాకాంత్ రెడ్డి, ఎడ్మా నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కస్నా నాయక్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పేద యువతుల వివాహానికి ఆర్థిక సాయం

యాచారం: పేదలకు ఆర్థిక సాయం చేయడం ఎంతో తృప్తినిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ ముదిరాజ్ పేర్కొన్నారు. మాల్ గ్రామంలో ఐదుగురు దళిత యువతుల వివాహాల కోసం రూ.10 వేల చొప్పున శనివారం రూ.50 వేలు అందజేశారు. ఆయన వెంట మాజీ వార్డు సభ్యుడు చిన్నోళ్ల జాంగీర్, వెంకటేశ్, ఈశ్వర్, యాదయ్య, రాములు, కృష్ణ పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య


షాద్‌నగర్: సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం

షాద్‌నగర్: ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు పట్టణంలోని పద్మావతికాలనీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భాగ్యమ్మ అన్నారు. ఆదివారం పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం భాగ్యమ్మ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన అన్ని సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. అర్హులైన ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రగతి గ్రామీణ ఫౌండేషన్ ద్వారా పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఆర్థికసాయం అందించనున్నట్లు చెప్పారు.

పాఠశాలలను బలోపేతం చేయాలి

కొత్తూరు: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి నాయకులు, యువత తమ వంతు సహకారం అందించాలని ఎంఈఓ అంగూర్‌నాయక్ సూచించారు. కొత్తూరు మున్సిపాలిటీలో శనివారం నిర్వహించిన బడిబాటలో భాగంగా ఆయన ఉపాధ్యాయులతో కలిసి పలు కాలనీల్లో పర్యటించారు. చదువు మధ్యలో మానేసిన విద్యార్థులు, బడీడు పిల్లల సమాచారం తమకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


నందిగామ: చిన్నారులతో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

నర్సప్పగూడలో బడిబాట

నందిగామ: ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చేర్పించాలని వాయిస్ ఫర్ వెల్ఫేర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సూచించారు. మండల పరిధిలోని నర్సప్పగూడ గోవిందు పోచయ్య కాలనీలో శనివారం ఆ సంస్థ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు సందీప్, జాహ్నవి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు చదువుకోవాలని, కార్మికులు, కర్షకులు తప్పకుండా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని సూచించారు. ప్రభుత్వం పిల్లలకు కావాల్సిన వసతులు కల్పిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కార్తీక్, మనీష్, లోకేష్, భరత్,దినేష్, విద్యార్థుల తల్లిదండ్రులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.


చేవెళ్ల: ఆలూరులో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


షాబాద్: పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి


మొయినాబాద్: చిలుకూరులో బక్రీద్ వేడుకలో ముస్లింలు


మొయినాబాద్‌రూరల్: కేతిరెడ్డిపల్లిలో..


కొందుర్గు: శ్రీరంగాపూర్‌లో ..

త్యాగనిరతికి ప్రతీక బక్రీద్

భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచే ముస్లింలు ఈద్గా, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ఉల్ అజ్‌హా శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో కులమతాలకు అతీతంగా పండుగను వైభవంగా నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్


షాద్‌నగర్: ఈద్గా వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే శంకర్


నందిగామ: మేకగూడలో ఈద్గా వద్ద నాయకులు


కొత్తూరు: మసీదు వద్ద..


చేవెళ్ల: శుభాకాంక్షలు తెలుపుకొంటున్న మైనార్టీ నాయకులు

బీసీసేన మహిళా గ్రామ కమిటీ ఎన్నిక

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని విఠ్యాల గ్రామంలో శనివారం జాతీయ బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు జక్కుల జలజ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విఠ్యాల నూతన కమిటీ అధ్యక్షురాలిగా బోయ హంసకళ, ఉపాధ్యక్షురాలిగా కోళ్ల యాదమ్మ, ప్రధాన కార్యదర్శిరాలిగా లావణ్య, కార్యదర్శిరాలిగా అనిత, సహాయ కార్యదర్శిరాలిగా పద్మమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

‘అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాలేదు’

మొయినాబాద్: బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎనికేపల్లి భూములు సాగుచేస్తున్న రైతులకు పట్టాలెందుకు ఇవ్వలేదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కీసరి సంజీవరెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మాజీ మంత్రి సబితారెడ్డికి అధికారంలో ఉన్నప్పుడు రైతులు ఎందుకు గుర్తుకు రాలేదన్నారు. ఎనికేపల్లిలోని సర్వే నంబర్ 180లో ఉన్న వంద ఎకరాల భూమిని దెబ్బై ఏళ్ల నుంచి సాగుచేసుకుంటున్న రైతులకు మూడుసార్లు మంత్రిగా పనిచేసిన సబితారెడ్డి అప్పట్లోనే పట్టాలు ఇచ్చి ఉంటే ఇప్పుడు ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదన్నారు. బీఆర్‌ఎస్ చేసే రాజకీయ డ్రామాలను ప్రజలు నమ్మడానికి సిద్ధంగా లేరన్నారు.